క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని చియ్యవరం, రాఘవరాజాపురం, ఎస్.కొత్త పల్లి, బొజ్జవారిపల్లి గ్రామాలలో వలంటీర్లుగా విధులు నిర్వహించడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఎంపీడీఓ జాషువా తెలిపారు. మొత్తం నాలుగు పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 3వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

పరిహారం అందజేత

ఓబులవారిపల్లె : మంగంపేట పంచాయతీలోని ఆర్‌ఆర్ సెంటర్‌లో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పులి నరసింహులు కుటుంబానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో రూ. 5 లక్షలు పరిహారం అందించారు. ఈ సందర్భంగా మంగంపేట ఉప సర్పంచ్ కొలూరు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పులి నరసింహులు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో మృతుని కుటుంబానికి పరిహారం అందజేశామన్నారు. దీంతో మంగంపేట గ్రామస్తులు ఎంపీ మిథున్ రెడ్డికి, ఎమ్మెల్యే కొరముట్లకు కృతజ్ఞతలు తెలిపారు.

అభినందన సభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బావికాడపల్లెలో చదువుతున్న విద్యార్థులు ఈ విద్యా సంవత్సరానికిగాను ఏపీ మోడల్ స్కూల్ ఆరో తరగతి ఎంట్రెన్స్ పరీక్షల్లో ఐదు మందిలో నలుగురికి సీటు రావడం హర్షించదగ్గ విషయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు తెలియజేశారు. విద్యార్థులు మోడల్ స్కూల్‌లో బాగా చదివి మంచి మార్కులు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం సీట్ సంపాదించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అభినందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి సంజీవనగర్ కాలనీకి చెందిన నలికిరి చిన్నకృష్ణ, లక్ష్మీదేవిల జ్ఞాపకార్థం కుమార్తె కవిత, అల్లుడు బాలాజీల ఆర్థిక సహాయంతో మంగళవారం మండంలోని బండపల్లె సమీపంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలని, ప్రజలకు ఉపయోగ పడే సేవ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, మేనేజర్ సుబ్బయ్య, దేవనాథ్‌రెడ్డి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జన జాగృతి సభను జయప్రదం చేయండి



సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, దండోరా నేతలు

రామాపురం : జులై 7వ తేదీన విజయవాడలో జరిగే జన జాగృతి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎమ్మార్పీఎస్ కో – కన్వీనర్ రామాంజనేయులు ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని చిట్లూరు దళితవాడలో కరపత్రాలను విడుదల చేశారు. మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో జులై 7న విజయవాడ జింఖానా మైదానంలో వర్గీకరణ కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టిన మాదిగల జన జాగృతి సభకు లక్షలాది మందితో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు మండల నాయకులు సాంబశివ, బాలరాజు, వెంకటరెడ్డయ్య, శ్రీకాంత్, ప్రసాద్, రెడ్డి, కిరణ్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలను కట్టడి చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాల పాఠశాలల్లో ఫీజుల కట్టడి చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఆర్జేడీకి వినతిపత్రం సమర్పించారు.

మీ–సేవ నిర్వాహకుడిపై ఫిర్యాదు

కలికిరి : పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం సమీపంలోని మీ–సేవ కేంద్రం నిర్వాహకుడిపై స్థానికులు జిల్లా కలెక్టరుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. నిర్వాహకుడు అధికారికంగా మీ–సేవ కేంద్రంలో కాకుండా మరోచోట నిర్వహిస్తూ వివిధ రకాల సేవలకు ప్రజల నుంచి అధిక వసూళ్లు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న మీ–సేవ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జగనన్న సురక్షను ప్రతిష్టాత్మకంగా చేపట్టండి

- గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టిన అధికారులు



పెనగలూరులో సమీక్షలో పాల్గొన్న అజయ్ రెడ్డి



చిన్నమండెం: జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఓబులవారిపల్లె మండలంలోని అప్పగుంటపల్లెలో..

సంబేపల్లె : పథకాలు పొందని వారి నుంచి సమస్యలు తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుట్టపల్లె 1, గుట్టపల్లె 2, మోటకట్ల గ్రామాలలోని సచివాలయంలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డిలతో కలిసి 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీంద్ర నాయుడు, అమరనాథరెడ్డి, ఆశోక్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణ, రమణారెడ్డి, సుదీర్‌రెడ్డి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని యల్లాయపల్లి సచివాలయ పరిధిలోని దళితవాడ గ్రామంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి అధికారులు, నాయకులు, వలంటీర్లతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పనిలేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకం ద్వారా ఆయా గ్రామాలలో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేందుకు నిర్ణయించారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి, ఎ.ఈశ్వరయ్య, ఎంపీడీఓ విజయారావు, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు : ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని అనంతరాజుపేట – 1 లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు వెళ్లి వారికి అవసరమైన జనన, మరణ, వివాహ తదితర 11 రకాల ధృవపత్రాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వార్డు మెంబర్లు గ్రామాలలో ఇంటింటా తిరిగి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, సెక్రటరీ శ్రీదేవి, వాలెంటరీలు , తదితరులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించి పథకాలు అందించండి

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్ష పథకంలో అర్హులను గుర్తించాలని జేసీఎస్ మండల కన్వీనర్ ఖాదర్‌మోద్దీన్(ఎస్‌కే) జేసీఎస్ మండల అధికారి దివాకర్ నాయక్, సర్పంచ్‌లు ఉమాపతిరెడ్డి, ఉమా ప్రభాకర్, జానకి, కమలమ్మ, ఎంపీటీసీ అమానుల్లాలు అధికారులకు తెలియజేశారు. మంగళవారం మండలంలోని నూలివీడు, గుండ్లచెరువు, గరుగుపల్లె గ్రామాల్లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకంపై కన్వీనర్‌లు, గృహసారథులు, వలంటీర్లుతో శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గ్రామాల్లో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. మిగిలిన వారు ఏ కారణంతోనైనా ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే గుర్తించి పథకాలు అందించేందుకు సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చామన్నారు. వలంటీర్లు ఇంటింటినీ జల్లెడపట్టి సంక్షేమ ఫలాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం రెడ్డివారిపల్లె, దేవలంపేట సచివాలయాల పరిధిలో జగనన్న సురక్షపై సచివాలయ అధికారులు, వలంటీర్లకు అవగాహన కల్పించినట్లు ఎంపీడీఓ రహీం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని జులై 1వ తేదీ నుంచి నిర్వహించబోయే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సంబేపల్లె: మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

పెనగలూరు : సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అనంతపల్లి, చక్రంపేట సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సురక్ష కార్యక్రమం ప్రజలకు మేలు చేసే కార్యక్రమమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందేటట్లు చూసి ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పథకాన్ని ప్రజలకు చేరువచేయాలన్నారు. కార్యక్రమంలో అనంతంపల్లి మాజీ ఎంపీటీసీ రామ్మోహన్, ఏఓ పద్మభూషన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డా.పద్మలలితకు బెస్ట్ టీచర్ అవార్డు



రాజంపేట : ఏఐటీఎస్‌లో ఈఈఈ హెచ్‌ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ పద్మలలిత బెస్ట్ ఉమెన్ టీచర్ (ఇంజనీరింగ్)) అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు ప్రిన్సిపాల్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఏపీ సెక్షన్, జేఎన్‌టీయూ – ఏ (అనంతపురం) వారు 2022కు గాను ఈనెల 23న ప్రకటించారన్నారు. ఆగస్టు 12న విజయవాడలో పద్మలలిత ఈ అవార్డును అందుకోనున్నారు. కళాశాల యాజమాన్యం, సిబ్బంది తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దాడులను నిరోధించండి

రాయచోటి అర్బన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, చిన్నపిల్లలు, పాత్రికేయులపై దాడుల నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన డీహెచ్‌పీఎస్ కార్యకర్తలతో కలసి కలెక్టరేట్ ఏఓ బాలక్రిష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సబ్బండ వర్గాలపై రోజురోజుకు దాడులు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో చిన్నపిల్లలపై సైతం దాడులు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి దాడులకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మరోమారు దాడులు జరగకుండా భద్రత కల్పించాలంటూ కోరారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవిశంకర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, డీహెచ్‌పీఎస్ నేతలు పండరయ్య, ఆంజనేయులు, మనోహర్ పాల్గొన్నారు.

బక్రీద్ పండుగ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్, పోలీసు అధికారులు

రాయచోటి అర్బన్ : బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఇచ్చే ఖుర్బానీ ఏర్పాట్లను మున్సిపల్, పోలీసు అధికారులు పరిశీలించారు. పండుగను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేయాలన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ గంగాధర్‌రావులు అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఆర్‌ఐ మల్లికార్జున, అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్‌ఐ నరసింహారెడ్డిలు ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని పండ్ల మండి వద్ద, మహబూబ్ నగర్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక జంతు వధశాలల ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గాతోపాటు అన్ని మసీదుల వద్ద పారిశుధ్య పనులను చేపట్టామన్నారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతాచర్యలు చేపట్టినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగల నిర్వహణకు తమవంతు సహాయ, సహకారాలు అందించాలంటూ కోరారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు

రాజంపేట : కడప అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న హై కోర్టు జడ్జి సురేష్‌రెడ్డిని మంగళవారం అమరావతిలో రాజంపేట న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా రాజంపేట కోర్టు సమస్యలను విన్నవించారు. సానుకూలంగా స్పందించిన జడ్జి కోర్టును సందర్శించి సమస్యలను పరిష్కరించేలా, అందరికి అనుకూలంగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, సెక్రటరీ ఆనంద్, సీనియర్ న్యాయవాదులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రఘునాథరెడ్డి, కృష్ణకుమార్‌లు పాల్గొన్నారు.

వాటర్ షెడ్లతోనే గ్రామాల అభివృద్ధి



రైతులకు పట్టలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ చెన్నకేశరెడ్డి

గాలివీడు : వాటర్ షెడ్ల ఏర్పాటుతోనే గ్రామాలు అభివృద్ధి జరుగుతుందని గోపనపల్లె, గుండ్లచెరువుల సర్పంచ్‌లు చెన్నకేశవరెడ్డి, ఉమా ప్రభాకర్‌లు అన్నారు. మంగళవారం గోపనపల్లె గ్రామంలో వాటర్‌షెడ్ కింద మంజూరైన పైపులు, పట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలే అభివృద్ధి ధ్యేయంగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సహకారంతో గుండ్లచెరువు వాటర్‌షెడ్ కింద గోపనపల్లె, సీసీ పల్లె గ్రామాలకు వాటర్‌షెడ్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటర్ షెడ్ల కింద ఒక వైపు అభివృద్ధి కార్యక్రమాలు, మరో వైపు రైతులకు అవసరమైన పనిముట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇంకా అవసరమైన రైతులకు త్వరలో రెండవ విడతలో అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ చైర్మన్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహబూబ్‌బాషా, మైనార్టీ నాయకులు నజీర్, బీసీ నాయకులు అయ్యప్ప, వెంకటరమణారెడ్డి, మల్లికార్జుననాయుడు, ఇరగంరెడ్డి రామచంద్రారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి లక్ష్యాలను చేరుకోండి



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసకళ్యాణ్

సిద్దవటం : విద్యార్థులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసకళ్యాణ్ తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాసకళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు మీ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలన్నారు. హాస్టల్ విద్యార్థులను సౌకర్యాలపై గదులును, మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య, వార్డెన్‌లు లక్ష్మీదేవి, రాజు, శివశంకర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి పూజలు



అలంకరణలో గాండ్లవీధి అంజన్న

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాండ్లవీధి, టోల్‌గేట్ వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయాలలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఉదయం నుంచి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో అంజన్నకు ఆకుపూజ చేయించారు.

పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోండి

ఓబులవారిపల్లె : మంగంపేట ఆర్‌ఆర్ – 2 అగ్రహారం గ్రామస్తులు తవసమస్యలు పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాల తరలింపు ప్రక్రియ ఆలస్యం జరుగుతోందని, వెంటనే గ్రామాలను తరలించి పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే, ఎంపీలు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఏపీఎండీసీ సీఎండీ సుదర్శన్ రెడ్డికి ఫోన్ ద్వారా ఆర్‌ఆర్ – 2 గ్రామ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. దీంతో గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంగంపేట ఆర్‌ఆర్–2 గ్రామస్తులు అనీల్, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, మైనార్టీ నాయకులు కరీముల్లా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ



రోడ్డు ప్రమాదలపై సీఐ, ఎస్‌ఐలకు సూచనలు చేస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై కొద్ది రోజుల నుంచి జరుగుతున్న రోడ్డు ప్రమాదలపై ప్రదేశాల మంగళవారం రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా పరిశీలించారు. మండల పరిధిలోని పలు ప్రమాద స్థలాలను పరిశీలించి రోడ్డు ప్రమాదాలపై తగు చర్యలు తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, రామాపురం ఎస్‌ఐ కొండారెడ్డిలకు సూచనలు, సలహాలు అందించారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ ప్రాగణంలో హాస్టల్ విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హాస్టల్ విద్యార్థులకు కనీస మౌలిక వసతులు లేవన్నారు. జిల్లాలో కొన్ని హాస్టల్స్‌కు రెగ్యులర్ వార్డన్ లేరన్నారు. దీంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదన్నారు. అధికారులు స్పందించి హాస్టల్స్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని గుర్రప్పగారిపల్లెలో ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి ఘనంగా సన్మానించారు. మంగళవారం ఈ పాఠశాలలో సన్మాన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో అత్యుత్తమ పదవుల్లో ఉపాధ్యాయ పదవి ఒక్కటన్నారు. నడక నేర్చేవరకు తల్లిదండ్రులు పిల్లల బాధ్యత వహిస్తే వారికి విద్యాబుద్ధులు నేర్పి ఎలాంటి లాభాపేక్ష లేకుండా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకొనేది ఉపాధ్యాయులేనన్నారు. అలాంటి ఉపాధ్యాయులను సన్మానించడం మన బాధ్యతన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు శ్రీరాముల రెడ్డి, సుబ్బరామ రాజు, ఈశ్వరయ్య, బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

రాయచోటి టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరి వ్యక్తులను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నాడు రాయచోటి ట్రాఫిక్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ. మంగళవారం సాయంత్రం చీకటి పడే సమయంలో రాయచోటి – మదనపల్లె రోడ్డులోని ఎంజీ గ్రాండ్ సర్కిల్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొని బైక్‌లు బోల్తా కొట్టాయి.

అదే సమయానికి ఆయన విధి నిర్వహణలో ఉన్న ఆయన వెంటనే వారిని ఇద్దరి తన సిబ్బందితో ఒక ఆటోను పిలిచి త్వరగా ఆస్పత్రికి పంపారు. ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఆయన తెలిపారు.

జీతాల చెల్లింపులపై చర్యలు తీసుకోండి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల జీతాలు ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును బాధితురాలికి అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె పంచాయతీ కొత్త దళితవాడకు చెందిన సొంటా గీతారాణి అనే మహిళలకు మంగళవారం సీఎం సహాయ నిధి రూ.లక్ష విలువ చేసే చెక్కును వైఎస్‌ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ కె.వి.సుబ్బయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరిరెడ్డి, ప్రతాప్, నరసింహారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మునిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటునివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి



రాజంపేట టౌన్: మాట్లాడుతున్న ఎంఈఓ గంగిరెడ్డి

సంబేపల్లె : తల్లిదండ్రులు సహకారంతోనే పాఠశాలలు అభివృద్ధి సాధ్యమని సంబేపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, నాడు – నేడుతో ప్రభుత్వం వేలకోట్లు ఖర్చు చేస్తోందన్నారు. తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. అదే విధంగా ఆదర్శ పాఠశాల, బొగ్గువారిపల్లె ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్ దిలీప్‌కుమార్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్య వెలకట్టలేని సంపద

రాజంపేట టౌన్ : విద్య వెలకట్టలేని సంపద అని ఎంఈఓలు గంగిరెడ్డి, సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని మందపల్లె అరుంధతివాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇక్కడి పాఠశాలకు చెందిన విద్యార్థులు నిరుపేదలైనందున రాజంపేట పట్టణానికి చెందిన అల్లం సుబ్రమణ్యం ఎక్కాలు, కాపీ రైటింగ్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్స్, బలపాలు ఇతర పుస్తకాలను అందజేయడం అభినందనీయమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు సంపాదించిపెట్టకపోయినా ఉన్నత విద్యావంతులను చేయాలన్నారు. ప్రతి ఒక్కరు విద్యావంతులైనప్పుడే సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోగలవని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.పోలయ్య, ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు నీరుగట్టు నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీహరి, సచివాలయ అధికారులు వెంకటేశ్వరరాజు, సురేష్, మహిళా కానిస్టేబుల్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : తల్లిదండ్రుల ప్రోత్సాహంపైనే పిల్లల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అందుబాటులో ఉందని, ఈటీఎస్‌తో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మిదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండాలి

వైవీయూ : పరిశోధకులు, విద్యార్థులకు ఉపయుక్తమయ్యేలా విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ఉండాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, జంతుశాస్త్ర శాఖలకు సంబంధించిన వెబ్‌సైట్‌ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల ప్రగతి, పరిశోధనల సమాచారం, జర్నల్స్ గురించి ఎప్పటికప్పుడు ఆధునీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.